క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వ పత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. హర నామస్మరణలో మునిగి తేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటఅప్పారావు దంపతులు

పరవాడ: రావాడ శివారు జల్లెలపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి సమ్మెంగ వెంకట అప్పారావు దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు. వియ్యపు, ఆలయ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యం, ఎం.సోమునాయుడు, పి.అప్పారావు, డి.సోమునాయుడు, పి.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న కాలనీ ప్రతినిధులు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం సమీపంలోని శివగాయత్రీనగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోలా సత్యం, ఉపాధ్యక్షుడిగా జి.సత్యనారాయణ, కార్యదర్శిగా కె.శివాజీ, సంయుక్త కార్యదర్శిగా జి.నానిపాత్రుడు, సభ్యులుగా ఎ.రమణమ్మ, అల్లు రత్నం, మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఎస్. శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వసతి గృహానికి లైట్లు, ఫ్యాన్ల వితరణ



వార్డెన్‌కు ఫ్యాన్లు, లైట్లు అందజేస్తున్న రాంకీ ఎండీ లాల్‌కృష్ణ

పరవాడ: స్థానిక బాలికల వసతి గృహానికి రాంకీఫౌండేషన్ సమకూర్చిన 10 ఫ్యాన్లు, 5 ట్యూబ్ లైట్లు, 5 చార్జింగ్ లైట్లను సోమవారం రాంకీ ఎండీ లాల్‌కృష్ణ వసతి గృహ వార్డెన్‌కు అందజేశారు. డాక్టర్ లాల్‌కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా వసతి గృహ విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డెన్ సుజాత, ఫౌండేషన్ డీజీఎం గిరిధర్‌రావు భక్షి, లైజనింగ్ ఏజీఎం రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రగతి కాంతులు



రత్నగిరినగర్‌లో రూ.1.98 కోట్లతో ప్రజల కోసం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ థీమ్ పార్కు

- జీవీఎంసీ 95వ వార్డులో విస్తృతంగా అభివృద్ధి పనులు
- రూ.11.82 కోట్లతో ఆధునిక డంపింగ్ యార్డు
- రూ.1.98 కోట్లతో రత్నగిరినగర్‌లో స్పోర్ట్స్ థీమ్ పార్కు
- రూ.4.60 కోట్లతో చీమలాపల్లి వద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

పెందుర్తి: జీవీఎంసీ విలీన ప్రాంతాలకు పట్టిన గ్రహణం దాదాపు వీడింది. సుమారు పుష్కరకాలంగా ఇక్కడి ప్రజలు పడుతున్న వెతల నుంచి బయట పడుతున్నారు. మూడేళ్ల కిందట వరకు కనీస మౌలిక వసతులు లేక అవస్థలు పడేవారు. అలాంటి ప్రాంతాలు ఇప్పుడు ప్రగతి బాట పట్టాయి.మౌలిక వసతులు సమకూరాయి. రూ.11.82 కోట్లతో ఆధునిక డంపింగ్ యార్డు నిర్మించారు. రోడ్లు మెరుస్తున్నాయి. పార్కులు ఆహ్లాదకరంగా మారాయి. దీంతో విలీన ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ వార్డుగా అడుగులు



రూ.కోటితో నిర్మించిన పాపయ్యరాజుపాలెం-లక్ష్మీపురం రోడ్డు

- చీమలాపల్లి వద్ద రూ.2 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణానికి 2022లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిధులు కొరత రావడంతో జీవీఎంసీ మరో 2.60 కోట్లు విడుదల చేసింది. దీంతో కన్వెన్షన్ సెంటర్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- రత్నగిరినగర్‌లో స్పోర్ట్స్ థీమ్ పార్కును రూ.1.98 కోట్లతో పూర్తి చేశారు. పార్కును ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.
- దీర్ఘకాలికంగా అభివృద్ధికి నోచుకోని పాపయ్యరాజుపాలెం-లక్ష్మీపురం రోడ్డు అందుబాటులోకి వచ్చింది. దాదాపు పది గ్రామాల ప్రజలకు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు.
- గొల్లవిల్లివానిపాలెంలో శ్మశాన వాటికను రూ.కోటితో అభివృద్ధి చేశారు.



95వ వార్డు వేపగుంట సమీపంలోని చీమలాపల్లి వద్ద రూ.2 కోట్లతో నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్



చీమలాపల్లి వద్ద రూ.11.82 కోట్లతో నిర్మించిన ఆధునిక డంపింగ్ యార్డు

సజావుగా ఎన్నికల ప్రక్రియ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనాథన్, పాల్గొన్న అధికారులు

నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు విశ్వనాథన్

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని నియోజకవర్గ ఎన్నికల పర్యవేక్షకుడు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ ప్రణాళికపై యంత్రాంగంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. పలు అంశాల వారీగా సమీక్ష జరిపారు. ఎన్నికల నియమావళిపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. అవసరమైన వారి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. రిటర్నింగ్ అధికారి శేష శైలజ, ఏఆర్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘కోడ్’ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు పెట్టవద్దు
- అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి శేషశైలజ



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శేషశైలజ

పెందుర్తి: ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.శేష శైలజ హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా సబ్బవరంలో బైక్ ర్యాలీ నిర్వహించిన టీడీపీతో పాటు ఆదివారం పెందుర్తిలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బైక్ ర్యాలీకి అనుమతి ఉన్నప్పటికీ.. మైక్ అనుమతి లేనందున ఆ పార్టీపై కూడా కేసు పెట్టామన్నారు. సమావేశాలు, ర్యాలీలు, ఇతర బహిరంగ కార్యక్రమాలకు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో నాయకుల చిత్రపటాలు తొలగించి..విగ్రహాలకు ముసుగులు వేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుందని..ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సహకరించాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ పర్యవేక్షణలో ఎన్నికల సిబ్బందికి ఏర్పాట్లపై తగిన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: ఆంధ్ర యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన టెక్ ఇగ్నైట్ 2024 పోటీల్లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో డీఈసీఈ చదువుతున్న బి.ఉమ, బి.గోవర్ధన్ ప్రథమ స్థానం, కాంపోనెంట్ ఐడెంటిఫికేషన్‌లో డీఈసీఈ చదువుతున్న బీవీవీఎస్ఎస్ వర్షిణి ద్వితీయ స్థానం, పీపీటీ ప్రజెంటేషన్‌లో డీఈఈఈ చదువుతున్న ఆర్.గణేష్, పి.కృపరాజ్ ద్వితీయ స్థానం, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో డీఈసీఈ చదువుతున్న జె.తేజేశ్వరవర్మ, జులేఖ ప్రవీన్, మహిషాలు తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం.నాగమణి, బి.శేషసాయి, సీహెచ్ ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



ఆత్మరక్షణపై మెలకువలు నేర్పిస్తున్న కిషోర్ కుమార్

సబ్బవరం: మహిళలపై దాడులు, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో తమని తాము రక్షించుకునేందుకు మార్గాలు అన్వేషించడం చాలా అవసరమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ సూర్య ప్రకాశరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా సోమవారం నిర్వహించిన ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తమై మెలకువలతో వేగంగా ఎలా స్పందించాలో ప్రత్యేక నిపుణుడు కిషోర్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా చైర్ పర్సన్ డాక్టర్ విజయ లక్ష్మి, ఫ్యాకల్టీ మెంబర్ భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తంగా ఉండాలి



పోలీసులు విడుదల చేసిన చెడ్డీగ్యాంగ్ ఫొటో

సబ్బవరం: మండలంలోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఐ పిన్నింటి రమణ సూచించారు. నలుగురు సభ్యులు ఉన్న చెడ్డీ గ్యాంగ్ ఇళ్లల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఇంట్లో వారిపై దాడి చేసి బంగారు ఆభరణాలు,నగదు చోరీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ముఠా విజయనగరం,విశాఖపట్నం జిల్లాల పరిధిలోని శివారు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఎటువంటి అనుమానం ఉన్నా.. అనుమానిత వ్యక్తులు కదిలికలను గుర్తించినా వెంటనే 100 టోల్ ఫ్రీ నంబర్, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మర్రిపాలెం చెక్ పోస్టు తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు ఎస్పీ విజయ భాస్కర్

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును సోమవారం జిల్లా అదనపు ఎస్పీ బి. విజయకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా పరదేశిమాంబ ఆలయ ప్రారంభోత్సవం



కోలాట ప్రదర్శనలో మహిళలు



గణపతి పూజలో పాల్గొన్న దంపతులు

సబ్బవరం: మండలంలోని ఆదిరెడ్డిపాలెంలోపరదేశిమాంబ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి పసిడి కలశ ఉరేగింపును వైభవంగా నిర్వహించారు.ఆదిరెడ్డిపాలెం గ్రామం నుంచి అమ్మవారి ఆలయం వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కలశ ఊరేగింపు చేపట్టారు. గణతిపూజలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.మంత్ర పుష్పాలు,అగ్ని ప్రతిష్టాపన ,జలాధివాసం,క్షీరాధివాసం పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి.

అప్పన్న సన్నిధిలో సినీ నటుడు ప్రభాస్ శ్రీను



సింహగిరిపై సినీ నటుడు ప్రభాస్ శ్రీను

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం సినీ హాస్యనటుడు ప్రభాస్ శ్రీను దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం

- పరీక్ష కేంద్రాల వద్ద సందడి
- విద్యార్థులను తనిఖీ చేసి పంపిన పోలీసులు

పదో తరగతి పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులతో పాటు తల్లి దండ్రులు కేంద్రాలకు రావడంతో సందడి నెలకొంది. విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించిన తర్వాత పోలీసులు కేంద్రంలోకి అనుమతించారు.



వాడచీపురుపల్లి పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

పరవాడ: పదో తరగతి పరీక్షలను మండలంలోని ఆరు కేంద్రాల్లో నిర్వహించారు. పరవాడ బాలికలు, బాలురు జెడ్పీ పాఠశాలలతో పాటు పెదముషిడివాడ, లంకెలపాలెం, వాడచీపురుపల్లి, పరవాడ సుమేధ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. మండల పరిధిలో 1271 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా సోమవారం 1264 మంది హాజరయ్యారు. 7 గురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఎంఈఓ ఎం.దివాకర్ రావు చెప్పారు. సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో దివాకర్‌రావు చెప్పారు.

పెందుర్తిలో 2372 మంది హాజరు

పెందుర్తి: మండలంలోని మొత్తం 12 కేంద్రాల్లో నిర్వహించిన తొలిరోజు పరీక్షకు 2401 మంది విద్యార్థులకు గాను 2372 మంది హాజరయ్యారు. 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం నుంచి కేంద్రాల వద్ద ఉదయం నుంచి కోలాహలం నెలకొంది. ప్రభుత్వం ఆర్టీసీ బస్‌ల్లో విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించింది.

11 మంది గైర్హాజరు

సబ్బవరం: మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించారు. 939 మంది విద్యార్థులకు గాను 928 మంది హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యా శాఖాధికారి లక్షణరావు తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 225 మంది విద్యార్థులకు గాను 214 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. సన్‌రిడ్జి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 134 మంది, ప్రతిభా విద్యాలయంలో 237 మంది ,మదర్ పబ్లిక్ స్కూల్‌లో 205 మంది,రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని అనకాపల్లి డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని స్క్వాడ్ జి. సాయి శైలజ పరిశీలించారు.

శతశాతం హాజరు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పలు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో 280 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణ తెలిపారు. సంస్కృతోన్నత పాఠశాలలో 160 మంది పరీక్షలకు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ చెప్పారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 167మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు. మూడు పాఠశాలల్లో ఎవరూ గైర్హాజరు కాలేదని ఆయా చీఫ్ సూపరింటెండెంట్లు చెప్పారు.



పెందుర్తిలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న పదోతరగతి విద్యార్థులు



మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ గురుకుల పాఠశాల వద్ద విద్యార్థులు

ఘనంగా పాల్గుణ పక్షోత్సవ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక వెంకటాద్రిపై ఎనిమిదో రోజు సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష్మీ హవనం, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

రాష్ట్రస్థాయి కోలాట పోటీల విజేత పరవాడ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అప్పలనాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో పరదేశిమాంబ జాతరను పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరవాడ సీతారామ కోలాట బృందం ప్రథమ స్థానంలో నిలిచింది.రెండో స్థానంలో శ్రీరామపట్నం జై శ్రీరామ్ కోలాటం బృందం కళాకారులు నిలిచారు. మూడో బహుమతిని శ్రీకాకుళం జిల్లా కుర్లాం శ్రీ తిరుమల శ్రీనివాస జట్టు గెలుచుకుంది. నాలుగో బహుమతి అంకుపాలెం శ్రీ అభయాంజనేయ కళాకారుల బృందం దక్కించుకుంది. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ. 15 వేలు , రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు, రూ.3 వేల చొప్పున గ్రామ సర్పంచ్, శ్రీనివాస్ సోదరుడు బోకం స్వామినాయుడు,మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వనం దేముడు బాబు, బోకం కాసు బాబు, బండారు చిన్నంనాయుడు, రాము, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంగారు మంగళసూత్రాల బహూకరణ



ఈవోకు మంగళ సూత్రాలు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి సోమవారం నగరంలోని కూర్మన్నపాలేనికి చెందిన ఎ.అప్పలరాజు దంపతులు 68 గ్రాముల బంగారు మంగళ సూత్రాలను సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తికి అందజేశారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు, ఉద్యోగి సాంబ తదితరులు పాల్గొన్నారు.